క్లుప్తంగా

వైభవంగా బంగారమ్మ తీర్థం

కొత్తపేట: స్థానిక గ్రామ దేవత బంగారమ్మ తీర్థం సోమవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి మహిళలు అమ్మవారికి కుంకుమ పూజలు, చలివిడి, పానకాలు నైవేద్యాలుగా సమర్పించారు. ఆలయ అర్చకులు మహాకుంభాభిషేకం సమర్పించారు. కొత్తపేట పరిసర గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకూ ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు సలాది బ్రహ్మానందరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, ఆ ప్రాంత యువకులు, భక్తుల సౌకర్యార్థం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్సై మణికుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



సత్యనారాయణను సత్కరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అయినవిల్లి మండల షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షులుగా జనిపల్లి భీమారావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా వ్యవహరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. నూతన పార్లమెంట్ భవనం సెంట్రల్ విస్టాకు అంబేడ్కర్ పేరు, కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ చిత్రం ముద్రించాలని ఎమ్మెల్యే, షెడ్యూల్ కులాల సంఘం నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అనంతరం దుక్కిపాటి శ్రీనివాసరావు స్మారక అవార్డును నేరేడిమిల్లి సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, మట్టపర్తి వెంకటరమణ, బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, దాసరి సాయిబాబు, సునీల్, వెంకట్ ఉన్నారు.

ఏటీఎం ఏర్పాటుకు సన్నాహాలు

రాజోలు: ఆర్టీసీ డిపో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ఆవరణలో ఏటీఎం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని డిపో మేనేజర్ పి.భాస్కరరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ఏటీఎం ఏర్పాటు చేసేందుకు ఆర్‌బీఐ గుర్తింపు పొందిన బ్యాంకుల నుంచి టెండర్లు పిలిచామన్నారు. టెండర్ ఫారాలు రాజోలు ఆర్టీసీ కార్యాలయంతో ఈ నెల 26వ తేదీ వరకు, అమలాపురం డీపీటీఓ కార్యాలయంలో ఈ నెల 25వ తేదీ వరకు విక్రయిస్తారన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలను రాజోలు ఆర్టీసీ డిపో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల లోపు వేయాలన్నారు. అదే రోజు మూడు గంటలకు టెండర్ ఫారాలు టెండర్‌దారుల సమక్షములో తెరుస్తామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలి

అంబాజీపేట: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి కంప్యూటర్ రంగంలో రాణించాలంటే సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండాలని సర్పంచ్ కోట బేబీరాణి అన్నారు. చిరతపూడి జెడ్పీ హైస్కూల్‌లో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను సర్పంచ్ బేబీరాణి సోమవారం ప్రారంభించారు. ఈ నెల 8 నుంచి 10 వరకు 1 నుంచి డిగ్రీ విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణను ల్యాప్‌టాప్‌పై ఇవ్వనున్నామని ట్రైనీ మాస్టర్ శ్రీనివాస్ తెలిపారు. వేదిక్ మ్యాథ్స్, పెయింటింగ్, రెజ్యూమ్ బిల్డింగ్, ఆన్‌లైన్ సేవలు, ఇంటర్వ్యూ స్కిల్స్, మాక్ ఇంటర్వ్యూ, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ తదితర వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ధాన్యం భద్రపరచుకోవాలి

ఆత్రేయపురం: తుపాను వల్ల రాబోయే రెండు రోజుల్లో వర్ష ప్రభావం ఉన్నందున రైతులు ధాన్యం భద్రపర్చుకోవాలని ఎంపీడీఓ నాతిబుజ్జి, ఏడీఏ ఎంవీ రామారావు రైతులకు సూచించారు. సోమవారం ఆత్రేయపురంలో ధాన్యం రాశులను పరిశీలించారు. గ్రామంలో ఉన్న ధాన్యాన్ని తక్షణమే రైస్ మిల్లులకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. ఉపాధి కూలీలను కూడా ధాన్యం ఆరబెట్టడానికి కేటాయిస్తున్నామన్నారు. ఏఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు 2800 ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు తెలిపారు. 4500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వర ప్రసాద్, ఏఈఓ మణికంఠవర్మ, వెంకటరత్నం, పీఏసీఎస్ సీఈఓ ముదునూరి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థినికి సత్కారం

రాజోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని పెమ్మాని పావని ఇంటర్ ఎంపీసీలో 957 మార్కులు సాధించడం అభినందనీయమని అమలాపురం డీవీఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం రాజోలు కళాశాలలో పెమ్మాని పావనిని అభినందిస్తూ జ్ఞాపిక అందజేశారు. ప్రభుత్వ కళాశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ప్రైవేటుకు దీటుగా విద్యార్థులు ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు విశేష కృషి చేస్తున్నారన్నారు. అధ్యాపకులు ఎ.పద్మశ్రీ, కె.గణేశ్వరరావు, పి.నరసింహరాజు, ఎం.అంబేడ్కర్, కె.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సంచార పశు ఆరోగ్యసేవతో మేలు

- పశువులకు అత్యవసర చికిత్స
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

మామిడికుదురు: గ్రామీణ ప్రాంతాల్లోని పశువులు అత్యవసర వైద్యం కావాలంటే మండల కేంద్రంలోని పశు వైద్యశాలలకు వాటిని తీసుకు వెళ్లి వైద్య చేయించాల్సిన పరిస్థితి ఉండేది. అక్కడకు తీసుకు వెళ్లి వైద్యం చేయించడంలో రైతులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. దీని వల్ల కాలయాపన జరగడంతో పశువులు మృత్యుబారిన పడేవి. కానీ అది గతం. ఇప్పుడు రైతులకు ఆ పరిస్థితి లేదు. పశుసంవర్ధకశాఖ ద్వారా 'డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ' అందుబాటులోకి వచ్చింది. నియోజకవర్గానికి ఒకటి వంతున సంచార వాహనం అందుబాటులోకి వచ్చింది. ఈ పథకంలో భాగంగా '1962'కి రైతులు ఫోన్ కాల్ చేయగానే ఆగమేఘాల మీద సంచార వాహనం అందుబాటులోకి వస్తోంది. దానిలో ఉండే పశువైద్యాధికారి పశువులకు ఉచితంగా చికిత్స చేసి మందులు అందించి వెళ్తున్నారు. ఈ సదుపాయం రైతులకు అందుబాటులోకి రావడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పథకం అమలుకు ఇదీ నేపథ్యం..

ప్రతి అయిదు వేల పశువుల యూనిట్‌కు ఒక పశు వైద్యుడు అందుబాటులో ఉండాలని జాతీయ వ్యవసాయ కమిషన్ 1976లో సూచించింది. ఈ ప్రతిపాదన మేరకు తమిళనాడు, గుజరాత్, తెలంగాణ తరహాలో ఈ విధానాన్ని మన రాష్ట్రంలో కూడా రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులోకి తీసుకువచ్చారు. దీని ద్వారా పేద రైతులకు తమ ఇంటి వద్దే నాణ్యమైన పశువైద్యం అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. దీనిలో భాగంగా పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో మూడు సంచార యూనిట్లు అందుబాటులోకి వచ్చాయి. పై మూడు నియోజకవర్గాల్లో సుమారు 20 వేలకు పైగా పశువులు ఉన్నట్లు అంచనా.



సంచార వాహనంలో రైతు పొలంలోనే ఆవుకు చికిత్స

అందించే సేవలు ఇవీ...

సంచార పశు వైద్య శాలల ద్వారా పశు ఆరోగ్య సేవలతో పాటు అనారోగ్య పశువు ఉన్న చోటనే సత్వరమే పశువ్యాధి నిర్ధారణ చేస్తారు. దానికి అనుగుణంగా నాణ్యమైన వైద్యం అందిస్తారు. దీంతో పాటు పశు వ్యాధుల వ్యాప్తి, నిర్మూలన వంటి అంశాలను అంచనా వేసి దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. కృత్రిమ గర్భోత్పత్తి సేవలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడం, పశు యాజమాన్యంపై సూచనలు, సలహాలు అందించి రైతులను చైతన్యం చేయడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడం కూడా ప్రధానమైనవి.

నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు



మొబైల్ సంచార వాహనం ద్వారా పశువులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నారు. ఫోన్ చేయగానే పశువు ఉన్న ప్రాంతానికి వచ్చి అత్యవసర వైద్యం అందిస్తున్నారు. సుదూర ప్రాంతానికి తీసుకువెళ్లాల్సిన శ్రమ తప్పింది. ఈ యూనిట్ వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– వేగి రాంబాబు, రైతు, పెదపట్నంలంక

చాలా ఉపయోగం



సంచార వాహనాలు అందుబాటులోకి తీసుకు రావడం చాలా ఆనందంగా ఉంది. పశువులకు ప్రాణాపాయం ఏర్పడిన ప్పుడు వెటర్నరీ డాక్టర్‌తో పాటు సిబ్బంది అక్కడకు చేరుకుని మెరుగైన వైద్యం అందిస్తున్నారు. దీంతో పాటు ఉచితంగా మందులు కూడా అందజేస్తున్నారు.

– కుంపట్ల ప్రసాద్, రైతు, బి.దొడ్డవరం

తక్షణం వైద్య సేవలు



మూగజీవాలు అనారోగ్యం బారిన పడిన వెంటనే 1962కు కాల్ చేయగానే రైతు తమ పేరు, గ్రామం, మండలం, పశువు అనారోగ్య సమస్యను వివరించాలి. ఈ సమాచారం రైతు భరోసా కేంద్రానికి చేరుతుంది. తక్షణం పశు వైద్య సహాయకుడు ఆ ప్రాంతానికి వెళ్లి వైద్య సేవలందిస్తారు. అత్యవసరమైన పక్షంలో సంచార వాహనంతో అక్కడకు వెళ్లి వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స అందిస్తున్నాం. అత్యవసరం అయితే పశువును వాహనంలో ప్రాంతీయ పశు వైద్యశాలకు తీసుకు వచ్చి ప్రాణాపాయం నుంచి రక్షిస్తున్నాం.

– జి.వంశీకృష్ణ, పశు వైద్యాధికారి

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

పి.గన్నవరం/మలికిపురం/అంబాజీపేట/ఆత్రేయపురం/మామిడికుదురు: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం, మానేపల్లి, కేశనపల్లి, అంబాజీపేట, ఆత్రేయపురం, మామిడికుదురు గ్రంథాలయాలధికారులు అన్నారు. ఆయా గ్రంథాలయాల్లో సోమవారం వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. ఈ శిబిరంలో చిత్రలేఖనం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్యాన్స్, సంగీతం, యోగా, గణితం, చదరంగం వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారని వారు వివరించారు.

నిర్మాణాల్లో అలసత్వం వద్దు

అంబాజీపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఆర్బీకే, సచివాలయం, వెల్నెస్ సెంటర్ భవన నిర్మాణాల్లో ఎటువంటి అలసత్వం వహించ వద్దని, త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో నాడు-నేడులో రూ.96 లక్షలతో నిర్మించే అదనపు తరగతి భవన నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. రెండు నెలల్లోగా పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మోకా ప్రకాష్, చప్పిడి రాజు, వాకపల్లి శ్రీనివాసరావు, పితాని వీరాస్వామి, నాగాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

పి.గన్నవరం: తాటికాయలవారిపాలెంలో వేంచేసిన మాచేనమ్మ జాతర సోమవారంతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. వినాయక యువజన సంఘ సభ్యులు, గ్రామస్తులు కార్యక్రమాలకు ఆధ్వర్యం వహించారు.

నేటి నుంచి పళ్లాలమ్మ తీర్థం

కొత్తపేట: వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారి తీర్థం మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్టు ఆ దేవస్థానం కమిటీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న తెలిపారు. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం నుంచి తీర్థం ప్రారంభమై నెలరోజుల పాటు జరుగుతుంది. ఈ తీర్థోత్సవాలకు కోనసీమ నుంచే కాకుండా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచీ అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ కమిటీ చైర్మన్ అమ్మన్న ఆధ్వర్యంలో ఈఓ బి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వి.మణికుమార్ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

దర్శించుకున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

వానపల్లి గ్రామ దేవత పళ్లాలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. రాత్రి పెద్ద జాతర, మంగళవారం నుంచి అమ్మవారి తీర్థమహోత్సవాలు సందర్భంగా స్వర్ణ, రజిత ఆభరణాలతో అలంకరించిన పళ్లాలమ్మ అమ్మవారిని జగ్గిరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ కమిటీ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, కమిటీ సభ్యులు, దేవస్థానం అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారికి జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగ్గిరెడ్డితో పాటు అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, రాష్ట్ర నాయకుడు కె.నాగిరెడ్డి, స్థానిక నాయకులు డి.మాధవరావు, వనుం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పళ్లాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

వృద్ధులకు చేయూత

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురానికి చెందిన నల్లా సత్యవతి, నల్లా రామారావులకు ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లి గ్రామానికి చెందిన సూరపురెడ్డి సురేష్ హోప్ హెల్పింగ్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిత్యావసరాలు, రూ.3 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో గంగుమళ్ల కాశీఅన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

సంక్షేమానికి అర్హతే ప్రామాణికం

- వాడపాలెం, బి.దొడ్డవరంలో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు జగ్గిరెడ్డి, చిట్టిబాబు

కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పార్టీ రహితంగా పేద, మధ్య తరగతి ప్రజల అర్హతే ప్రామాణికంగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పారదర్శక పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని వాడపాలెంలో సోమవారం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వారికి అందిన పథకాలను జగ్గిరెడ్డి వివరించారు. ప్రతిగా వారు ప్రభుత్వం అందించిన పథకాలపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వానికి భిన్నంగా ఈ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. మరోసారి జగన్‌ని ముఖ్యమంత్రిని చేసుకుని మరిన్ని వినూత్న సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. మధ్యాహ్నం రైతులు, రైతు కూలీల సౌకర్యం కోసం బొబ్బర్లంక కాలువపై మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాల్లో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, మండల కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీ నేలపూడి భీమరాజు, బండారు కృష్ణమూర్తి, ఎంఏఎస్ఎం చైర్మన్ పెదపూడి శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మట్టా బాబ్జి, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, వాసంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: సంక్షేమ పథకాల అమల్లో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. సోమవారం బి.దొడ్డవరం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గ్రామంలో జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలే అజెండాగా తీసుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారని చెప్పారు. ప్రజారంజకమైన పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా కాకుండా సంక్షేమ పథకాలు ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని ఎమ్మెల్యే చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, గ్రామ శాఖ అధ్యక్షుడు కేదారశెట్టి మల్లి, కన్వీనర్లు వాకపల్లి వీరాస్వామి, బద్దే రామకృష్ణ, కాంత్రేగుల సత్యవతి, యనమదల లక్ష్మీప్రసన్న, పార్టీ నేతలు గెద్దం వెంకటేశ్వరరావు, తులా గోపాలకృష్ణ, నెల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బి.దొడ్డవరంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు



వాడపాలెంలో లబ్ధిదారులకు అందిన పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు



రాజోలులో పూర్ణిమకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు శ్రీనివాస్, పద్మావతి



మామిడికుదురు మండల ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి నగదు అందిస్తున్న దేవాంగ ప్రతినిధులు

రాజోలు: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు నిరూపించారని ఎంఈఓ ఎం.విజయశ్రీ అన్నారు. రాజోలుకు చెందిన ఆకుల అంజనా దుర్గాపూర్ణిమ పదో తరగతి ఫలితాల్లో 584 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండలంలో ప్రథమస్థానం సాధించింది. ఉపాధ్యాయుల సూచనలు, తల్లిదండ్రుల ప్రోద్బలంతోనే ఈ మార్కులు ఆధించానని ఆమె తెలిపింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడమే తన లక్ష్యమని ఆమె పేర్కొంది. మండలంలో అత్యధిక మార్కులు సాధించిన పూర్ణిమను ఎంఈఓ విజయశ్రీ, ప్రధానోపాధ్యాయిని సుభాషిణి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 588 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన చెల్లుబోయిన యశ్వితను, 569 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిన బాసిన లక్ష్మీ నాగ శ్రీజను మండల విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అలాగే వారి తల్లితండ్రులకు వారు అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు పై సత్కారం చేశారు. గ్రామ సర్పంచ్ పసలపూడి లక్ష్మీ పద్మమంగతాయారు, ఎంఈవో నల్లి మనోహరం, హెచ్ఎం మద్దాలి వెంకటేశ్వరరావు, రిటైర్డ్ టీచర్ ఎంవీఎల్ నరసింహం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముప్పర్తి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పితాని మేరీ కుమారి పాల్గొన్నారు. కాగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జాన శంకరరావు, ఎంపీటీసీ జాన లక్ష్మీదుర్గ సూర్యావతి అభినందనలు తెలిపారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను సోమవారం ఘనంగా సత్కరించారు. జగ్గన్నపేట దేవాంగ సంఘం ఆధ్వర్యంలో మొదటి స్థానంలో నిలిచిన దేవాంగ విద్యార్థులు పిచ్చిక వైష్ణవి, చింతా నాగవసంతలకు రూ.1500 వంతున, ద్వితీయ స్థానం సాధించిన చింతా సాయిలక్ష్మిదుర్గకు వెయ్యి రూపాయలు నగదు పురస్కారం అందించారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం అధ్యక్షుడు జాన పాలాక్షుడు, దేవాంగ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మామిడికుదురులో సందడి చేసిన పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: స్థానిక గోకవరపు గణాధిపతి జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆద్యంతం కోలాహలంగా జరిగింది. 1986–87 పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఒక చోట చేరి సందడి చేశారు. నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్య నేర్పిన గురువులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. వారికి బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని అధ్యక్షతన జరిగిన సమావేశం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. వివిధ హోదాల్లో ఉన్న వారు తమ కుటుంబ నేపథ్యాన్ని వివరించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులకు ఆశీస్సులు అందించారు. పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యేడిద తారక రవికుమార్, సర్కిల్ అబ్బాస్ అలీబేగ్, నక్కా పట్టాభిరామ్, నయినాల వెంకటరత్నం, కస్తూరి సుధారాణి, నయినాల అలివేలు మంగతాయారు, కర్రా వీరవెంకట సత్యనారాయణ, నయినాల రఘురామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంటర్నల్ ఆడిట్

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఇంటర్నల్ ఆడిట్ జరిగింది. ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆడిట్‌ను జిల్లా సమగ్ర శిక్ష ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, ఏఎంఓ పి.రాంబాబు పర్యవేక్షించారు. విశాఖపట్నం ఆర్‌బీ అసోసియేట్‌కు చెందిన చార్టర్డ్ అకౌంటెంట్లు కె.కార్తీక్, పి.అక్షయరెడ్డి ఇంటర్నల్ ఆడిట్‌ను నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిధిలోని స్కూల్ కాంప్లెక్స్‌లకు సంబంధించి 2022–23 సంవత్సరానికి చెందిన రికార్డులు తనిఖీ చేసి పకడ్బందీగా ఆడిట్ నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ వి.నాగేశ్వరి సీఆర్‌పీలు యడ్ల అపర్ణ, గంటి శ్రీనివాసు, మేరింకుమారి పాల్గొన్నారు.



ఆలమూరు పాఠశాలలో ఇంటర్నల్ ఆడిట్‌ను పర్యవేక్షిస్తున్న విద్యాశాఖాధికారులు

సీడబ్ల్యుఏ ఆధ్వర్యంలో సత్కారం

కొత్తపేట: మండల క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ (సీడబ్ల్యుఏ) కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు హామీ ఇచ్చారు. మండలంలోని వానపల్లి శివారు సత్యాలవారిపేట చర్చిలో సోమవారం మధ్యాహ్నం సీడబ్ల్యుఏ మండల సమావేశం జరిగింది. సంఘ అధ్యక్షుడు సామ్యేల్ జయరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి డేవిడ్‌రాజును ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ పాస్టర్స్ ఫెలోషిప్ సీడబ్ల్యుఏకు కొత్తపేటలో సొంత స్థలం సమకూర్చుకున్నామని, భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించాలని డేవిడ్‌రాజును కోరారు. దానిపై ఆయన మాట్లాడుతూ ఈ అంశాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అముడా తొలి చైర్మన్‌గా నియమితులైన డేవిడ్ రాజును సీడబ్ల్యుఏ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ అడపా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వానపల్లిలో అముడా చైర్మన్ డేవిడ్‌రాజు సత్కరిస్తున్న సీడబ్ల్యుఏ సభ్యులు

యంత్రాలతో వరి కోతలు కోయండి

అంబాజీపేట: వాతావరణాన్ని రైతులు దృష్టిలో ఉంచుకుని యంత్రాల ద్వారా మాత్రమే వరి కోతలను కోయాలని ఏవో సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు అన్నారు. మండలంలోని కె.పెదపూడి, పుల్లేటికుర్రులో ఉన్న ధాన్యపు రాశులను, వరి చేలను సోమవారం పరిశీలించారు. వీరు మాట్లాడుతూ చేలల్లో ఉన్న ధాన్యపు రాశులను మెరక ప్రాంతాల్లోకి తరలించి ఆరబెట్టాలన్నారు. ఈ సమయంలో బరకాలను దగ్గరగా ఉంచుకోవాలని సూచించారు. కోసిన ధాన్యాన్ని రైతులు వెంటనే దగ్గరలో ఉన్న రైస్ మిల్లులకు ఆఫ్‌లైన్ విధానంలో తరలించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని చోట్లా ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, వీహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

సహదేవ్‌కు కలెక్టర్ సత్కారం

సఖినేటిపల్లి: మండలానికి చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ టైం మెంబర్ తాడి సహదేవ్‌ను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సత్కరించారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సభ్యుడిగా చేస్తున్న సేవలను గుర్తించి కలెక్టర్ తనను సత్కరించారని సహదేవ్ సోమవారం చెప్పారు.



సహదేవ్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ శుక్లా

నా భూమిని అప్పగించండి

ఆలమూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దొంగ రిజిస్టర్ కాబడిన తన భూమిని తనకు అప్పగించాలని మూలస్థాన అగ్రహారం గ్రామానికి చెందిన రైతు తోరాటి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆ రైతు ఫిర్యాదు చేశారు. జీవనోపాధి రీత్యా తెలంగాణ రాష్ట్రంలోని బోధన్‌లో నివసిస్తుండగా కొందరి రెవెన్యూ అధికారుల అండదండలతో తన భూమిని అన్యాయంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు తగు విచారణ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.